క్లుప్తంగా

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

బేల: పల్లెలోని నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని సైద్‌పూర్, సాంగ్వి(జి), తోయగూడ గ్రామాల్లోని హరితహారం కోసం సిద్ధం చేస్తున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ఎండకాలం దృష్ట్యా నర్సరీల్లో మొలక ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి సమీర్‌హైమద్, సర్పంచ్‌లు ఉన్నారు.

కంటివెలుగుపై కళాజాత

తాంసి: భీంపూర్ మండలంలోని డబ్బకుచ్చి గ్రామంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటివెలుగుపై కళాజాత నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులు పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కళాబృందం సభ్యుడు వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రతిఒకరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కళాబృందం సభ్యులు రమేష్, రాజు, నర్సమ్మ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

నార్నూర్: సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 2023- 24 మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బీపీడీపీ) సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఏఈ సుభాణి, ఐకేపీ ఏపీఎం రమేశ్, ఏపీవో సురేందర్ రాథోడ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నార్నూర్: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జీసీడీవో ఛాయ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు మాన్కాపూర్ బాలిక ఆశ్రమ పాఠశాల, దిశ మోడల్ పాఠశాలలను తనిఖీ చేశారు. పదో తరగతిలో ప్రీఫైనల్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఐటీడీఏ నుంచి సరఫరా చేసిన స్టడీ మెటీరియల్స్‌ను పరిశీలించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు విఠల్, దేశ్‌షా, తదితరులు పాల్గొన్నారు.

పత్తి మొదళ్లను కలియ దున్నాలి

తాంసి: పత్తి పంట మొదళ్లను కలియ దున్నాలని వ్యవసాయ శాస్త్రవేత్త రాజశేఖర్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని పొన్నారి గ్రామంలో వ్యవసాయ పరిశోధన స్థానం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతులకు చిప్ ప్రెడ్డర్‌తో మిషన్‌తో పత్తి మొదళ్లు కలియ దున్నడంపై అవగాహన కల్పించారు. కలియ దున్నడంతో గులాబీ పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. కూలీల కొరతతో పాటు సమయాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవీందర్, సర్పంచ్ సంజీవ్ రెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, ఏఈవో యోగిరాజ్, రైతులు లక్ష్మీపతి, నందు, అశోక్, స్వామి, సంజీవ్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తలమడుగు: మండలంలోని కుచులాపూర్‌లో శనివారం బీసీ సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకన్న యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోచ్చన్న, ప్రచార కార్యదర్శిగా రాము, కోశాధికారిగా గణేశ్ సింగ్‌లను ఎన్నుకున్నారు. సదాశివ్, రవికాంత్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకాపూర్, వాన్‌వాట్ గ్రామ శివారు ప్రాంతంలో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనులను డీఆర్‌డీవో కిషన్ శనివారం పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల్లోని నర్సరీలను తనిఖీ చేశారు. ప్రజలకు కావాల్సిన మొక్కలను పెంచాలన్నారు. ఆయన వెంట ఏపీడీ రాథోడ్ రవీందర్, సర్పంచ్‌లు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల సందడి

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి పల్లెప్రకృతి వనంలో శనివారం పాఠశాల విద్యార్థులు సందడి చేశారు. మండలంలోని కరంజి(టి) ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వనభోజనాల కార్యక్రమంలో భాగంగా గుబిడి గ్రామంలోని పల్లెప్రకృతి వనానికి వచ్చారు. ఆటలు ఆడుతూ.. సరదాగా గడిపారు. సమీపంలో పెన్‌గంగ నదిని తీసుకెళ్లి దాని ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భూమన్న, సర్పంచ్ ప్రతాప్, ఉపాధ్యాయులు స్వామి, భోజన్న పాల్గొన్నారు.

తల్లి చెంతకు బాలిక

ఎదులాపురం: చిన్నారి తప్పిపోయిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన హ్యాండ్ కాప్ ఫౌండేషన్‌కి సంబంధించి నలుగురు మహిళలు శనివారం ఆదిలాబాద్‌కు వచ్చారు. పండగ తులసి అనే మహిళ కూతురు ప్రవళిక కూడా వచ్చింది. ఆదిలాబాద్‌లో డొనేషన్లు సేకరిస్తున్న క్రమంలో ప్రవళిక తప్పిపోయింది. సంతోష్ అనే వ్యక్తి డయల్ 100, చైల్డ్‌లైన్ 1098లకు సమాచారం అందించాడు. కానిస్టేబుల్ వెంకటరమణ వివరాలు సేకరించి ఆమెను తల్లిచెంతకు చేర్చారు.

ఆహా.. జొన్నరొట్టె

సండే స్పెషల్



- ఆరోగ్యాన్ని పంచుతూ.. ఉపాధి పొందుతూ
- తినేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు
- డిమాండ్‌కు అనుగుణంగా విక్రయ కేంద్రాలు



జొన్న రొట్టెలు అమ్ముతున్న మహిళ



కలుపుతున్న పిండి

కైలాస్‌నగర్: జొన్న రొట్టెలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే దొరికేవి. పట్టణాల్లోనైతే ఇది వరకు హోటళ్లలో మాత్రమే లభించేవి. కానీ ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విరివిగా లభిస్తున్నాయి. వాటిని కొనుగోలు చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రజల డిమాండ్‌కనుగుణంగా జొన్నరొట్టెల విక్రయ కేంద్రాలు వెలిశాయి. ఆదిలాబాద్ పట్టణంతో పాటు చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన మహిళలు జొన్న రొట్టెలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, రిమ్స్ ఆసుపత్రి ఎదుట, ఆర్టీసీ డిపో వద్ద ప్రత్యేక జొన్న రొట్టె తయారీ కేంద్రాలు వెలిశాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు 200 నుంచి 300 రొట్టెలు తయారు చేస్తున్నారు. రూ.10 చొప్పున విక్రయిస్తూ.. ఉపాధి పొందుతున్నారు. ఖర్చులు పోను రోజుకు రూ.400 నుంచి రూ.800 వరకు ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు. కొంతమంది హోటల్ నిర్వాహకులు సైతం ప్రత్యేకంగా మహిళలను నియమించుకుని జొన్న రొట్టెలు తయారు చేస్తున్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఎంతోగానో ఉపయోగపడుతాయి. సూపర్ మార్కెట్లోనూ ప్యాకింగ్ చేసిన జొన్న రొట్టెలు లభించడం గమనార్హం.

రోజు కొనుగోలు చేస్తా..



నాకు ముందటి నుంచి జొన్న రొట్టెలు తినడం అలవాటు. అయితే మా ఇంట్లో వాటిని చేయడం లేదు. దీంతో గత రెండేళ్ల నుంచి జొన్న రొట్టెలు కొనుగోలు చేస్తున్నాను. రోజు విడిచి రోజు ఐదు రొట్టెలు తీసుకెళ్తాను. నాకు షుగర్ ఉంది. జొన్న రొట్టెలను తినడం ద్వారా కంట్రోల్ ఉంటుంది.

– కిషోర్, రిటైర్డు ఏఎస్సై, రాంనగర్

ఆరోగ్యానికి మంచిది



బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి జొన్నరొట్టే ఎంతో ఉపయోగపడుతుంది. జొన్న రొట్టెలను రెగ్యులర్‌గా తినడం ద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. జీర్ణ వ్యవస్థ మెరుగుపడడంతో పాటు షుగర్ లెవల్స్ సైతం అదుపులో ఉంటాయి.

– ఎస్.రాజ్‌కుమార్, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



తాంసి: శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శనగ పంటను తీసుకువచ్చిన తాంసి గ్రామానికి చెందిర రైతు విఠల్‌ను సన్మానించారు. పంటలను దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఏవో రవీందర్, సొసైటీ సీఈవో కేశవ్, పీఎసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, చందర్ రెడ్డి, జామిడి, హస్నాపూర్ సొసైటీ సీఈవోలు రాంరెడ్డి, దత్తు, శ్రీధర్ రెడ్డి, కృష్ణ, వెంకన్న, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ గింజ కొంటాం..

బోథ్: రైతులు పండించిన ప్రతీగింజను కొనుగోలు చేస్తామని బోథ్ ఎమ్మెల్యే బాపురావు అన్నారు. బోథ్ మార్కెట్‌యార్డులో శనగ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహదేవ్ అనే రైతును సన్మానించారు. మహిళా సమాఖ్య కార్యాలయానికి ప్రహరీ నిర్మాణం, తాగునీటి సదుపాయం కల్పించాలని మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, వైస్ ఎంపీపీ లింబాజీ, నారాయణ రెడ్డి, ఎలుక రాజు, తాహెర్ బిన్ సలాం, జ్యోతి, మహమూద్, రమణ గౌడ్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి కృషి

ఇచ్చోడ: వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరాక్రాంతి పథకం ఆధ్వర్యంలో ఎంపిక చేసిన లబ్ధిదారుడికి ట్రాక్టర్ అందజేశారు. సీఎం కేసీఆర్ రైతుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, జిల్లా మార్కెట్ అధికారి శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం దయాకర్, ముస్తాఫా, రాథోడ్ ప్రవీణ్, రాథోడ్ ప్రకాశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వడూర్‌కు ఘనమైన చరిత్ర



విగ్రహ ప్రతిష్ఠాపనలో యోగానంద సరస్వతి



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాపురావు

నేరడిగొండ: మండలంలోని వడూర్‌కు ఘనమైన చరిత్ర ఉందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం గ్రామంలో దేశ్‌పాండే పరివారం ఆధ్వర్యంలో హనుమాన్ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన విగ్రహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి పాల్గొన్నారు. యజ్ఞం, హోమం కార్యక్రమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ సజన్, సర్పంచ్ గాదె సమత, పండరి, రాములు, శంకర్, పొన్న గంగారెడ్డి, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మారుమూల గ్రామాలకు కనీస మౌలిక వసతులను కల్పించడం కోసం ఎమ్మెల్యే జోగు రామన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. మండలంలోని హత్తిగుట్ట, రాజు గూడ గ్రామాల శివారు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తే బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి తన కృషి వల్లనే పనులు ప్రారంభమయ్యాయని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రహదారి పనులు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే జోగు రామన్న విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, చందు, గంగారాం, పరుశురాం, రాజు, సేవ్వ జగదీష్, రమణ, మోతిరాం, తదితరులు పాల్గొన్నారు.

రిమ్మలో న్యాయవిజ్ఞాన సదస్సు



అవగాహన కల్పిస్తున్న బోథ్ సివిల్ జడ్జి హుస్సేన్

సిరికొండ: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని రిమ్మ గ్రామంలో సర్పంచ్ పెందూర్ అధ్యక్షతన న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యహక్కు, బాల్య వివాహాలు, మోటారు వెహికిల్ చట్టాలు, అటవీ చట్టాలు, లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులు జడ్జి హుస్సేన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెందూర్ అమృత్ రావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాది దమ్మపాల్, గ్రామ పటేల్ శంకర్, తొడసం అమృతరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకిస్తున్న డీఎస్పీ ఉమేందర్, ఉపాధ్యాయులు

తాంసి: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. శనివారం మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించి వాటి పని తీరును అడిగి తెలుసుకున్నారు. కప్పర్ల, నిపాని, బండల్ నాగాపూర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 70 ప్రాజెక్టులు తయారు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కప్పర్ల ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్‌కు దీటుగా రాణిస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి ఆలోచనలతో మేధాశక్తిని ఉపయోగించినప్పుడే సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి నర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, సర్పంచ్ సదానంద్, ఎంపీటీసీ సంతోష్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, పాఠశాల హెచ్‌ఎం కిష్టన్న, నిపాని హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కృతికి నిలయాలు సరస్వతి శిశుమందిరాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

బజార్‌హత్నూర్: శ్రీసరస్వతి శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలుగా నిలుస్తున్నాయని జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిరం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు, భజన, నాటికలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ అజాడే జయశ్రీ, సర్పంచ్ పరచ లావణ్య, ఎంపీటీసీ లక్కం తిరుమల, ఎంపీడీవో చౌహాన్ రాధ, ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, ఎంఈవో శ్రీకాంత్, చట్ల విలాస్, నాగానాథ్, రాజన్న, పాండురంగ్, ప్రధానోపాధ్యాయులు పొర్ని వెంకటరమణ, ప్రత్యూష పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తలమడుగు: మండలంలోని లింగి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో వీడ్కోల్ పార్టీ అలరించింది. శనివారం ఎస్‌వో సువర్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థినులు దేశభక్తి, సినీగేయాలకు నృత్యం చేశారు. విద్యార్థుల కేరింతలు మార్మోగాయి. ఎస్‌వో మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. భారీ వాహనాలతో ఇబ్బందులు



జైనథ్: మండలంలోని తరోడ బ్రిడ్జి కుంగిపోవడంతో అంతరాష్ట్రీయ రహదారి గుండా రాకపోకలకు బ్రేక్ పడింది. అధికారులు బ్రిడ్జి కింద నుంచి వాగు మీదుగా తాత్కాలిక రోడ్డు నిర్మించి రాకపోకలు పునరుద్ధరించారు. గత కొన్ని రోజులుగా ఇరుకుగా ఉన్న బ్రిడ్జి మీదుగా భారీ వాహనాలు వెళ్తున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– సంబంధిత అధికారి: సుభాష్, డీఈ, ఎన్‌హెచ్‌ఏఐ, ఫోన్: 86399 23927

ఈరోజు

ఆలయ వార్షికోత్సవం

ఎదులాపురం: పట్టణంలోని తిలక్‌నగర్‌లోని శ్రీపంచముఖి హనుమాన్ దేవాలయ 12వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్న ఆలయ పూజారి చంద్రకాంతయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం అన్నదానం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీవోఈ ఎంట్రెన్స్ టెస్ట్

బోథ్: మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో జరగనున్న సీవోఈ ఎంట్రెన్స్ టెస్ట్‌కు సర్వం సిద్ధం చేశామని ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు వచ్చేటప్పుడు ఎగ్జామ్ ప్యాడ్, బ్ల్యూ లేదా బ్లాక్ పెన్ను తీసుకురావాలన్నారు. 648 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా భట్రాజు సంఘం ఎన్నికలు

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా భట్రాజు సంఘం సర్వసభ్య సమావేశం, ఎన్నికలు ఆదివారం ఉదయం 10 గంటలకు యాదవ సంఘ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు బిరుదు భగవాన్ రాజు ప్రకటనలో తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరై ఓటు వినియోగించుకోవాలని, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఎన్నికల అధికారిగా చెన్నమాధవుని శ్రీరామరాజు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్తం

పరామర్శ

ఇంద్రవెల్లి: మండలంలోని దనోర(బి) గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, బీఆర్‌ఎస్ నాయకులు పుర్క చందర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి 11 కేవీ విద్యుత్ తీగలను ఇళ్ల పైనుంచి తొలగించారు. సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, మోహన్‌నాయక్, సతీష్, రవి, బాబుశ్యాం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండలంలోని చిన్నహత్నూర్ ఆదివాసీ బిర్సగోండ్ తోటి యువసేన ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు, రూ.3వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కురిసెంగే అర్జున్, చాహకటి మహేష్, ఆత్రం భూమేష్, నైతం సాయిబాబా, కుడిమెత మోహన్, నైతం గోపి, సెడ్మకి సతీష్ పాల్గొన్నారు.

క్రీడ సామగ్రి అందజేత

బేల: చిన్నారులు, యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలని క్రీడ సామగ్రి అందజేశామని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామా రూపేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రూ.10వేల విలువ గల క్రికెట్, వాలీవాల్, షటిల్ క్రీడ సామగ్రిని టాక్లీ గ్రామ చిన్నారులు, యువకులకు అందజేశారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, మడావి చంద్రకాంత్, రాకేష్, గణేష్, మేకల జితేందర్, అడ్డికి సునీల్ పాల్గొన్నారు.

ఐటీఐలో ఉచిత శిక్షణ



అవగాహన కల్పిస్తున్న జన శిక్షణ కేంద్రం నిర్వాహకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ఐటీఐలో వివిధ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ www.pmkvy.skillindia.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు గల వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌లో 30 సీట్లు, డొమెస్టిక్ డెటా ఎంట్రీలో 30 సీట్లు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ టేలర్‌లో30 సీట్లు, అసిస్టెంట్ మెటల్ ఆర్క్ వెల్డింగ్, షీల్డెడ్ మెటర్ ఆర్క్ వెల్డింగ్‌లో 30 సీట్లు ఉన్నాయన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

టైలరింగ్, బ్యూటీషియన్‌లో..

ఇంద్రవెల్లి: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా టైలరింగ్, బ్యూటీషియన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జన శిక్షణ సంస్థ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ వర్ని సంతోష్ తెలిపారు. శనివారం ఉచిత శిక్షణ తరగతులపై యువతులు, మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9666789710 సంప్రదించాలని కోరారు.

బైక్ చోరీ

ఎదులాపురం: పట్టణంలోని విద్యానగర్‌లో బైక్ చోరీకి గురైంది. విద్యానగర్‌కు చెందిన షిందే వెంకటి ఈనెల 1న బైక్ హ్యాండిల్ లాక్ వేసి ఇంటి బయటే ఉంచాడు. ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.